క్లుప్తంగా

పాఠశాల ప్రహరీకి భూమిపూజ



మరికల్: మండలంలోని ఇబ్రహీంపట్నం ప్రాథమిక పాఠశాల చుట్టు ప్రహరీ నిర్మాణానికి శనివారం కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే పర్ణికారెడ్డి సహకారంతో అమ్మ ఆదర్శ పాఠశాల కింద ప్రహరీ నిర్మాణానికి రూ. 5 లక్షల నిధులు మంజూరయినట్లు పార్టీ నాయకులు జనార్దన్, సత్యనారాయణ, శ్రీనివాసులు తెలిపారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నాణ్యతతో త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాజు, రవి పాల్గొన్నారు.

మే డే వాల్‌పోస్టర్ల విడుదల



అమరచింత: పని గంటల పెంపుదలతో పాటు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను తిప్పికొట్టేందుకు కార్మికులందరూ సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందని టీయూసీఐ జిల్లా కోశాధికారి రాజు, మాస్‌లైన్ పార్టీ మండల కార్యదర్శి రాజన్న కోరారు. టీయూసీఐ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం మే డే వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. దేశంలో 47 కోట్ల మంది శ్రమజీవుల్లో కేవలం ఏడు కోట్ల మందికి మాత్రమే ఉద్యోగ, సాంఘిక భద్రత, తగిన వేతనాలు అందుతున్నాయన్నారు. మిగితా 40 కోట్ల శ్రమజీవులకు సరిపడా వేతనాలు, జీవనభద్రత లేదని వాపోయారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను ఆమోదించి, అమలు చేయాలని చూడడం వల్ల కార్మికులు కట్టు బానిసలుగా మారబోతున్నారని ఆరోపించారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. జిల్లాలో 139వ మే డే ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో సామేలు, భక్తరాజు, కురుమన్న, ఏసన్న, ఆనంద్ పాల్గొన్నారు.

మోడల్ ఈఏపీసెట్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని జీపీఎన్‌సీఈలో శనివారం ఏర్పాటుచేసిన మోడల్ ఈఏపీసెట్ పరీక్ష కేంద్రాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 150 మంది విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇప్పిస్తున్నామని.. వారిలో ఈఏపీసెట్‌పై భయం పోగొట్టేందుకు మోడల్ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జీపీఎన్‌సీఈ చైర్మన్ రవికుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత శిక్షణ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సమ్మర్ క్యాంపులో భాగంగా న్యూటౌన్‌లోని యూనిక్ స్కూల్ ఆఫ్ ఆర్ట్ యూనిస్టూట్‌లో విద్యార్థులకు డ్రాయింగ్, పేయింటింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పాఠశాల నిర్వాహకుడు మహ్మద్ సద్దాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు డ్రాయింగ్ బుక్, పెన్సిల్, పరీక్ష ప్యాడ్, ఆయిల్ పాస్టెల్స్, కలర్ పెన్సిల్ తీసుకుని రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 95050 26190 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

సామాజిక సేవకు అవార్డు

మహబూబ్‌నగర్ రూరల్: మదాసి/మాదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ధన్వాడ రాములుకు అవార్డు లభించింది. సామాజిక సేవా కార్యక్రమాలకు గాను మహాత్మా జ్యోతిరావు పూలే జాతీయ ఐకాన్ అవార్డు- 2025కు ఆయన ఎంపికై నట్లు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డా.సరోజనమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రిలో ఆ సంస్థ ప్రతినిధుల చేతులమీదుగా రాములు అవార్డు అందుకోనున్నట్లు పేర్కొన్నారు.

శ్రీనివాస రామానుజన్‌కు ఘన నివాళి

వనపర్తి టౌన్: గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ గణిత శాస్త్రంలో సాధించిన ఘనతలను మరువలేనివని, గణితం ఉన్నంత వరకు రామానుజన్ గుర్తుంటారని మహనీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్ రాజారాంప్రకాశ్ అన్నారు. రామానుజన్ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గిరిరాజాచారి, బాలేమియా, కృష్ణయ్య, దర్శన్ కుమార్, బాలస్వామి, నాగరాజు, వెంకటేష్, నరసింహ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

- ఉపాధి హామీ పనులు పకడ్బందీగా చేపట్టాలి
- డీఆర్‌డీవో మొగులప్ప



మాట్లాడుతున్న డీఆర్‌డీవో మొగులప్ప

మాగనూర్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని డీఆర్‌డీవో మొగులప్ప అన్నారు. శనివారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉమ్మడి మాగనూర్, కృష్ణ మండలాల ఉపాధి హామీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో జాతీయ ఉపాధి హామీ పథకం అమలు, కూలీల పెంపునకు తీసుకుంటున్న చర్యలు, చేపడుతున్న పనుల వివరాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు.

రెండు నెలలే కీలకం

ఉపాధిహామీ పనులకు వేసవి కాలం కీలకమైందని ఏప్రిల్, మే లో పనులు ముమ్మరంగా సాగుతాయని డీఆర్‌డీఓ తెలిపారు. మిగిలిన 10 నెలలో 40 శాతం పనులు జరిగితే ఈ రెండు నెలల్లో 60 శాతం నిర్వహిస్తామన్నారు. ఈ వేసవిలో ఎక్కువ సంఖ్యలో పనులు నిర్వహించాలని తెలిపారు. గ్రామాల వారీగా ఈజీఎస్‌లో ఉపాధి హామీలో కూలల సంఖ్యను పెంచడంతో పాటు వేసవి ఉష్ణోగ్రతలు అధికమవుతున్న నేపథ్యంలో ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు పనులు ముగించాలన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని తగిన రక్షణ చర్యలు చేపట్టి కూలీల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం సెర్ప్ ఉద్యోగులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం మేరకు త్వరగతిన విద్యార్థుల యూనిఫాం కుట్టి ఇవ్వాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉమ్మడి మండలాల ఎంపీడీఓలు రహ్మతుద్దీన్, జానయ్య, ఎంపీఓ విజయలక్ష్మి, ఏపీలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఫిల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు

మరికల్: మండలంలోని తీలేర్‌లో జేడీ ఈశ్వర్‌రెడ్డి శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా రైతులు తమ పశువులకు గాలికుంటు టీకాలను వేయించాలని సూచించారు. కార్యక్రమంలో జేఈఓలు చిన్నరాయుడు, వాసుదేవుడు, గోపాల మిత్ర శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

జాతీయ పశువైద్య చికిత్స దినోత్సవం

మండల కేంద్రంలోని పశువైద్యశాలల్లో శనివారం జాతీయ పశువైద్య చికిత్స దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహాదేవ్ పశువులకు గర్భనిర్ధారణ పరీక్షలు చేసి, మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న మూగజీవాలకు చికిత్స చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ శ్రీకాంత్, రైతులు మల్లేష్, గోపి పాల్గొన్నారు.



పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న డాక్టర్

స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన విద్యార్థికి సన్మానం



ముష్టిపల్లిల్లో విద్యార్థి అశ్వినిని సన్మానిస్తున్న గ్రామస్తులు

మక్తల్: మండలంలోని ముష్టిపల్లికి చెందిన అశ్విని కేజీబీవీలో చదివి ఇంటర్ రెండో సంవత్సరం సీఈసీలో 962 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంకుగా నిలవడం గర్వించదగ్గ విషయం అని గ్రామస్తులు కొనియాడారు. ఈ మేరకు విద్యార్థితో పాటు తల్లిదండ్రులు మెకలి వెంకటన్న, పద్మను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో డీలర్ లక్ష్మారెడ్డి, నర్సిములు, సూపర్‌వైజర్ అరుణ, మంజుల, నందు, దామోదర్, లక్ష్మన్న, లక్ష్మయ్య, హన్మంతు, రాజశేఖర్ తదితులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

దామరగిద్ద: పట్టుదలతో చదివి మారుమూల గ్రామంలో పుట్టిన అక్షయ ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించడం తల్లిదండ్రులకు, గ్రామానికి గర్వకారణమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామయ్యగౌడ్, వ్యాలీ వాక్ కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం దామరగిద్దలో విద్యార్థి అక్షయతో పాటు వారి తల్లిదండ్రులు ఫిజికల్ డైరెక్టర్ వెంకటప్ప, విజయ ను వారి నివాసంలో శాలువాతో సత్కరించారు. ప్రభాకర్, సందీప్, మురళీఘట్, పీఈటీ కతలప్ప, ప్రవీన్‌కుమార్, పుట్టి అంజి పాల్గొన్నారు.



దామరగిద్దలో..

విజేతలకు బహుమతులు అందజేత



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఆదిత్యపరాశ్రీస్వామి

ఊట్కూరు: మండలంలోని బిజ్వారం అంబత్రయ క్షేత్రంలో రెండు రోజులుగా కొనసాగుతున్న తెలంగాణ రాష్ట్ర సబ్‌జూనియర్ షూటింగ్‌బాల్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ పోటీల్లో 33 జిల్లా స్థాయి జట్లు పాల్గొనగా.. విజేతలకు ఆదిత్యపరాశ్రీ స్వామి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆదిత్యపరాశ్రీ స్వామి మాట్లాడుతూ గెలుపోటములు సహజం అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే వారికి బంగారు భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోట కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2 శాతం ఇచ్చే ఉద్యోగాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రథమ బహుమతి కొత్తగూడెం, ద్వితీయ బహుమతి ఆసిఫాబాద్, తృతీయ బహుమతి నాగర్‌కర్నూల్ జిల్లా బృందాలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండయ్య, క్రీడా నిర్వాహకులు ఐలయ్య, రిటైర్డ్ పీఈటీ గోపాలం, రమేష్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను చెల్లించాలి

మద్దూరు: మద్దూరు మున్సిపాలిటీలోని ప్రజలు 2025–26 ఏడాదికి సంబంధించిన ఇంటి పన్నును ఈ నెల 30 వరకు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. గడువు లోగా చెల్లిస్తే 5 శాతం తగ్గింపు ఉందని పేర్కొన్నారు.

రెవెన్యూ సదస్సులు

మద్దూరు: భూ భారతి రెవెన్యూ సదస్సులను శనివారం మండలంలోని చింతల్‌దిన్నె, దోరేపల్లి గ్రామాల్లో అధికారులు నిర్వహించారు. చింతల్‌దిన్నెలో తహసీల్దార్ మహేష్‌గౌడ్‌కు 43 మంది రైతులు భూ సమస్యలపై దరఖాస్తులు అందించగా, దోరేపల్లిలో డిప్యూటీ తహసీల్దార్ వాసుదేవ చారికి 228 మంది రైతులు దరఖాస్తులు అందించారు.

ఆర్మీ జవాన్‌కు సన్మానం



దామరగిద్ద: మండలంలోని బాపన్‌పల్లి గ్రామానికి చెందిన యువకుడు రవియాదవ్ ఇటీవల ఇండియన్ ఆర్మీలో జవాన్‌గా ఎంపిక కావడంతో శనివారం శిక్షణ నిమిత్తం బెంగళూరుకు బయలుదేరాడు. ఈ సందర్భంగా టీడీపీ ఉమ్మడి జిల్లా హడక్ కమిటీ సభ్యుడు రాములుయాదవ్ రవియాదవ్‌ను శాలువాతో సత్కరించాడు.

వేసవి బడులను ఉపయోగించుకోండి



ముడుమాల్ ప్రాథమిక పాఠశాలలో వేసవిబడికి హాజరైన విద్యార్థులు

కృష్ణా: ప్రతి విద్యార్థి కూడా గ్రామాల్లో నిర్వహించే వేసవి బడులను సద్వినియోగం చేసుకోవాలని ముడుమాల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శేఖర్ సూచించారు. శనివారం పాఠశాలలో వేసవి బడిని ప్రారంభించడంతో గ్రామంలోని విద్యార్థులు అత్యధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రధానంగా విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ భాషపై, చేతిరాత మెరుగుపర్చడం, గణితం, విజ్ఞానం ఇలా ప్రతి అంశంపై నైపుణ్యత సాధించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ వేసవి బడి 40 రోజులపాటూ కొనసాగుతుందన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ



మలేరియాపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

మాగనూర్: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆస్పత్రి నుంచి బస్టాండ్ చౌరస్తా వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి అఫ్రోజ్ మాట్లాడుతూ.. మలేరియా రహిత సమాజం కోసం సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని కోరారు. అదే విధంగా ప్రతి శుక్రవారం పరిసరాల పరిశుభ్రత పాటించాలని, దీనిలో భాగంగా ప్రతి ఇంటిలో నిల్వ ఉండే నీటి వనరులను పారబోసి, కొత్త నీటిని నింపుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఇళ్ల చుట్టుపక్కల, మురికి కాల్వలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అలాగే మలేరియా మరణాలు తగ్గించాలంటే దోమలు పుట్టకుండా చేయడమేమనని, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వెంకటేష్‌గౌడ్, ల్యాబ్ టెక్నీషియన్ రాఘు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని ఖండించాలి



నారాయణపేట రూరల్: ఉగ్రదాడిని నిరసిస్తూ శనివారం రాత్రి పట్టణంలో వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. స్థానిక శ్రీశివలింగేశ్వర దేవస్థానం నుంచి చౌక్ బజార్ మీదుగా వీరసావర్కర్ చౌరస్తా వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా సంఘం పెద్దలు మాట్లాడుతూ.. పాకిస్తాన్ దుశ్చర్యను తీవ్రంగా ఖండించారు. అమాయక ప్రజలపై హింసకాండకు దిగడం అమానుషమని మండిపడ్డారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి అమరవీరులకు నివాళులర్పించారు.

భక్తిశ్రద్ధలతో మహా చండీహోమం



చండీహోమం నిర్వహిస్తున్న భక్తులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని సంతోషిమాత ఆలయంలో శనివారం మహా చండీ హోమం నిర్వహించారు. ముందుగా అమ్మవారిని లక్ష్మీదేవి, సరస్వతి మాతగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 13 హోమ గుండాల్లో 52మంది దంపతులతో పండితులు మొట్టా చిపవన్, వెలికంటి కార్తీతీర్థం, సుమన్, పూర్ణచందర్, దామోదర్ వేద మంత్రోచ్చారణల మధ్య మహా చండీహోమం జరిపించారు. హోమం అనంతరం పూర్ణాహుతి సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద గుప్తా మాట్లాడుతూ.. హోమాలు, యజ్ఞాలతో ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందని అన్నారు. ప్రతి ఒక్కరిలో భక్తిభావం పెరగాలని.. ఆధ్యాత్మిక చింతనతో సమాజంలో శాంతి నెలకొంటుందన్నారు. చండీ హోమం ఫలితం మున్సిపాలిటీలో ప్రజలందరికీ కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి, ఎంఈఓ మంజులాదేవి, స్థానికులు విజయలక్ష్మి, అశోక్‌రావు, సురేందర్, ఆలయ కమిటీ అధ్యక్షురాలు గుబ్బ సుజాత, శ్రీను, రాధాకృష్ణ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



నవాబుపేట: రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య అన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్‌లో భాగంగా శనివారం మండలంలోని కాకర్జాల, చౌడూర్, కొల్లూర్ గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియంత పాలన సాగిస్తూ.. రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తోందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానాలు, రాజ్యాంగ విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వాసుయాదవ్, ఖాజా, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నీలకంఠ, రమేశ్‌గౌడ్, అమరేష్, శ్రీహరి, సత్యం, నర్సింహ, ఉమర్, ఆంజనేయులు, కుమార్, శ్రీనివాస్, రమేశ్, వెంకటేశ్, ఖాజామైనుద్దీన్ పాల్గొన్నారు.

మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకురావాలి



సమీకృత కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న అఖిలపక్ష ఐక్యవేదిక ప్రతినిధులు

వనపర్తి విద్యావిభాగం: పాతకోటలోని సమీకృత కూరగాయల మార్కెట్, పాత వ్యవసాయ మార్కెట్‌లోని సమీకృత మార్కెట్లను వెంటనే వినియోగంలోకి తేవాలని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం అఖిలపక్ష ఐక్యవేదిక ప్రతినిధుల బృందం ఆయా మార్కెట్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.కోట్లు పెట్టి బిల్డింగులు కట్టి.. నిరుపయోగంగా వదిలేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. కానీ కాసుల కోసం మళ్లీ కొత్త భవనాలు కడతామంటున్నారని ఎద్దేవా చేశారు. పాతకోటలోని కందకంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా 14వ ఫైనాన్స్ నిధులతో కట్టిన కూరగాయల మార్కెట్ నిరుపయోగంగా ఉందని, దాన్ని వినియోగం లోకి తేవాలని ప్రజలు కోరుతున్నారన్నారు. లేకపోతే డబుల్‌బెడ్ ఇళ్లు కట్టి ప్రజలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంధం నాగరాజు, సీపీఎం నాయకులు మార్టిన్, గొనికాడి యాదయ్య, బొడ్డుపల్లి సతీష్, శివకుమార్, కష్ణయ్య, శ్రీనివాసులు, సురేష్, రాముడు, బాషా తదితరులు ఉన్నారు.

బారులు తీరిన వరి ధాన్యం ట్రాక్టర్లు



రాంపూర్ గేట్ జయంత్ రైస్‌మిల్లు వద్ద రహదారిపై బారులు తీరిన వరి ధాన్యం వాహనాలు

నర్వ: మండలంలోని రాంపూర్ గేట్ వద్ద ఉన్న జయంత్ రైస్‌మిల్లు వద్ద వరి ధాన్యం విక్రయించేందుకు లోడ్‌తో వచ్చిన వాహనాలు బారులు తీరాయి. మండలానికి కేటాయించిన ఈ రైస్‌మిల్లు వద్దకు ఒక్కసారిగా ధాన్యం వాహనాలు రావడంతో మరికల్–ఆత్మకూర్ రహదారిపై కిలోమీటర్ మేర నిలిచిపోవడంతో రెండు రోజులుగా రైతులు అవస్థలు పడుతున్నారు. దీనిపై పీఏసీఎస్ సీఈఓ ఉదయ్‌ను వివరణ కోరగా.. పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం ద్వారా మండలంలోని ఆయా గ్రామాల నుంచి దాదాపు 80 వేల బస్తాల వరకు ధాన్యం సేకరించామన్నారు. మొత్తం ఒకే రైస్‌మిల్లుకు కాకుండా కన్మనూర్ సాయిబాలాజీ, విజయలక్ష్మి, మరికల్ విశాల్ ఇండస్ట్రీ, మాగనూర్ మండలంలోని గుడెబల్లూర్ రైస్‌మిల్లులకు ధాన్యం తరలించేలా కేటాయించామన్నారు. మండలం మొత్తం 4.50లక్షల బస్తాలు వచ్చే అవకాశముందని, దీంతో 3 లక్షల గన్నీ బ్యాగుల అవసరమున్నట్లు ఉన్నతాధికారులకు తెలిపామన్నారు. ధాన్యం లోడ్‌ను వేగంగా అన్‌లోడ్ చేసేలా హమాలీలను అందుబాటులో ఉంచుకోవాలని రైస్ మిల్లు యాజమానులు సూచించామన్నారు.

గన్నీ బ్యాగుల కొరతపై రైతుల ఆందోళన



ధన్వాడలో నిరసన తెలుపుతున్న రైతులు

ధన్వాడ: కొన్ని రోజులుగా గన్నీ బ్యాగుల కోసం రోజు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని శనివారం ధన్వాడ సింగిల్ విండో కార్యాలయం ఎదుట రైతులు ఆందోళన చేపట్టారు. దాదాపు 15 రోజుల నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా.. ఇప్పుడు, అప్పుడు అంటూ కాలం వెళ్లదీస్తున్నారని, కానీ గన్నీ బ్యాగులు మాత్రం ఇవ్వట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. విషయాన్ని అప్పుడే అక్కడికి వచ్చిన అడిషనల్ కలెక్టర్‌కు విన్నవించారు.

ఇలా వచ్చి ఇలా..

శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో 25వేల గన్నీ బ్యాగులు సింగిల్ విండో కార్యాలయం వద్దకు రావడంతో రైతులు బ్యాగులు తీసుకునేందుకు ఎగబడ్డారు. దీంతో బ్యాగులన్ని పది నిమిషాల్లోనే ఖాళీ అయిపోయాయి. మళ్లీ బ్యాగులు ఎప్పుడు వస్తాయనే సమాచారం లేకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేశారు.

మోదీ హయాంలోనే అంబేడ్కర్‌కు నిజమైన గౌరవం



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డి

వనపర్తి టౌన్: కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్ మీద ఏనాడు అభిమానం చూపలేదని, దేశ తొలి న్యాయశాఖ మంత్రిగా అంబేడ్కర్ మొదలుపెట్టిన హిందూ కోడ్ బిల్లును నెహ్రూ అడ్డుకోవడంతోనే ఆనాడు అంబేడ్కర్ రాజీనామా చేశారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ఎస్సీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు అశోక్ అన్నారు. అంబేడ్కర్ జయంతి నుంచి 15 రోజుల పక్షోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా అధ్యక్షుడు నారాయణ అధ్యక్షతన జిల్లాకేంద్రంలో నిర్వహించిన సెమినార్‌లో వారు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ దశాబ్దాల పాలనలో అంబేడ్కర్‌కు గౌరవం దక్కలేదని, మోదీ హయాంలోనే నిజమైన గౌరవం దక్కిందన్నారు. అంబేడ్కర్‌ను పార్లమెంట్‌లో అడుగుపెట్టనివ్వకుండా విపక్షాలతో కలిసి కుట్రపూరితంగా ఓడించి, గెలిచిన అనామకుడిని పద్మవిభూషణ్‌తో సత్కరించారని దుయ్యబట్టారు. నెహ్రూ కుటుంబానికి వందలాది ఎకరాల్లో స్మారక ఘాట్లు ఉంటే.. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ మరణిస్తే ఆయన భౌతికకాయాన్ని విమానంలో ఎక్కించి మహారాష్ట్రకు పంపి, రవాణా ఛార్జీలను చెల్లించాలని అంబేడ్కర్ సతీమణి నోటీస్ పంపిన ద్వంద్వ నీతి కాంగ్రెస్ పార్టీది అని, అంబేడ్కర్ పేరు ఎత్తే నైతిక హక్కు లేదని హితవు పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు హేమారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామన్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు సుమిత్రమ్మ, సీతారాములు, విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు రూ.12వేలు ఇవ్వాలి

ఆత్మకూర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రేవంత్ రెడ్డి సర్కార్ వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు మహమూద్, జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. శనివారం నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలో జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలకు ఆత్మకూర్ నుంచి తరలివెళ్లారు. రెండు రోజుల పాటు జరిగే మహాసభల్లో వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రాములు, నాయకులు, కార్మికులు ఉన్నారు.

అమరచింత: నారాయణపేట జిల్లా మరికల్‌లో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల్లో పాల్గొనేందుకు అమరచింత మండలం నుంచి సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు శనివారం ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్, శంకర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, సహాయ కార్యదర్శి ఆర్‌ఎన్ రమేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, కోశాధికారి వెంకటేష్, సత్యం, బుచ్చన్న, విజయ్, అరుణ్, మోహన్, రవి, రాఘవేంద్ర, చంటి పాల్గొన్నారు.